ప్రజాశక్తి
ఆదివారం 8 అక్టోబర్ 2023
5
శ్రీ సత్యసాయి

తహశీల్దార్ కార్యాలయం వద్దనే నిద్రిస్తున్న పేదలు

పట్టాలిచ్చే వరకూ.. కార్యాలయమే నివాసం..!

◆ తహశీల్దార్ కార్యాలయం ముందు స్నానాలు చేసిన పేదలు

◆ అధికారులు స్పందించే వరకు పోరాటం ఆగదు ◆ సిపిఎం, వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

'ఇళ్లు లేని తాము ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే వాటిని నిర్ధాక్షిణ్యంగా తొలగించారు. ఇప్పుడు నిలువనీడ లేకుండా పోయాం. ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు తహశీల్దార్ కార్యాలయమే మా నివాసం'. అంటూ పేదలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గత 20 రోజులుగా చిలమత్తూరులో సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో పేదలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. అధికారులు పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడంతో శనివారం నాడు వారు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడే స్నానాలు చేసి నిరసన తెలిపారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్‌తో పాటు పేదలు తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో బహిరంగంగా స్నానం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పేదలు మాట్లాడుతూ ఇళ్లు లేని తాము ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే అధికారులు కక్షగట్టి వాటిని తొలగించారన్నారు. గుడిసెలకు నిప్పుపెట్టడంతో అందులో ఉన్న వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయన్నారు. తమకు నిలువనీడ లేకుండా చేసిన అధికారుల తీరును నిరసిస్తూ తహశీల్దార్ కార్యాలయంలోనే స్నానాలు చేసి ఇక్కడే ఉండేందుకు సిద్ధం అయ్యామన్నారు. కార్యాలయం వద్దనే వంటావార్పు, నిద్రించి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటామన్నారు. ఇళ్ల పట్టాల సమస్యల పరిష్కారంపై శనివారం నాడు జాయింట్ కలెక్టర్‌ను కలుస్తానని తహశీల్దార్ అపద్ధపు మాటలు చెప్పారన్నారు. అధికారులు స్పందించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రెవెన్యూ అధికారులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..

పేదలు వేసుకున్న గుడిసెలను అకారణంగా తొలగించి, నిప్పుపెట్టిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సర్వేనెంబర్ 805-6, 805-7లో పేదలు వేసుకున్న గుడిసెలను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలిగించారన్నారు. గుడిసెలకు నిప్పుపెట్టడంతో విలువైన వస్తువులు, బట్టలు, పలు ధ్రువీకరణ పత్రాలు కాలిబూడిదయ్యాయన్నారు. ఒక్కో గుడిసె రూ.20వేలతో 400 కొట్టాలు వేసుకున్నారని చెప్పారు. ఈ నష్టాన్ని రెవెన్యూ అధికారులు పేదలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, రామచంద్ర, కమిటీ సభ్యులు చంద్ర, శివ, సదాశివరెడ్డి, రహంతుల్లా, మణిస్వామి, పేదలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందే నిద్ర

పేదలు శనివారం రాత్రి తహశీల్దార్ కార్యాలయం ఆవరణ వద్దనే నిద్రించారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షా శిబిరం నుంచే పేదలు తహశీల్దార్‌కు ఫోన్ ద్వారా మాట్లాడారు. ఇందుకు స్పందించిన ఆయన సోమవారం నాడు జాయింట్ కలెక్టర్‌ను కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. సోమవారం నాడు ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని పేదలు ఆయనకు తెలియజేశారు.

గుప్పుమంటున్న గంజాయి

◆ గుట్టుగా డ్రగ్స్ ◆ మద్యం మత్తులో జోగుతున్న యువత

రెండు రోజుల క్రితం అగళి మండలం పూలేపల్లి గ్రామంలో సాగు చేసిన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గంజాయి మత్తు గుప్పుగుప్పు మంటుండగా, గుట్టుగా డ్రగ్స్ విక్రయాలు సాగుతున్నాయి. ప్రధానంగా యువత ఈ మత్తులో జోగుతోంది. ఒకప్పుడు జిల్లాలో ఇవి ఉండేవి కాదు. ప్రస్తుతం జిల్లాలో ఇప్పుడు జోరుగా విక్రయాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రెండు గ్యాంగ్‌లు పోలీసులకు పట్టుబడటం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి ఇదే తరహాలో డ్రగ్స్ కూడా గుట్టుగా విక్రయాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విశాఖపట్నం టు అనంతపురం

జిల్లాకు ఎంతో దూరంలోనున్న విశాఖపట్నం, పాడేరుల నుంచి అనంతపురం జిల్లాకు ఈ గంజాయి సరఫరా అవుతున్నట్టు పోలీసులు ఇటీవల జరిపిన దాడుల్లో గుర్తించారు. వన్‌టౌన్, ఫోర్త్ పోలీసు స్టేషన్ల పరిధిలో 18 మంది గంజాయి సరఫరాదారులను గుర్తించి పట్టుకున్నారు. వీరి నుంచి 21 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇంత పెద్దఎత్తున గంజాయి జిల్లాలో లభించడం ఇదే ప్రథమం కావచ్చు. గతంలో లభించిన కొద్ది కిలోల్లోపే ఉండేది. దీన్ని కొద్ది మంది పూర్తిస్థాయి వ్యాపారంగా మలుచకుని నిరంతరాయంగా విశాఖపట్నం ప్రాంతం నుంచి తీసుకొచ్చి విక్రయించడమే పనిగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. జిల్లా మొత్తంగానే ఈ బృందాలు విక్రయాలు సాగిస్తున్నారన్న ఆరోపణలునన్నాయి. దీనిపై పోలీసు శాఖ సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే మడకశిర ప్రాంతంలో తాజాగా గంజాయి పంట పెంపాన్ని గుర్తించడం మరింత విస్మయానికి గురిచేస్తోంది. జిల్లాలో పెద్దఎత్తున సాగు చేసిన దాఖలాలు గతంలో చాలా వరకు తక్కువగా ఉండేది. ఇటీవలి కాలంలో చూస్తే ఇదే తొలిసారి కావడం గమనార్హం. దీని వినియోగం ఏ మేరకు పెరుగుతోందన్న ఆందోళన నెలకొంటోంది.

గుట్టుగా డ్రగ్స్ ?

గుట్టుగా డ్రగ్స్ కూడా జిల్లాలో విక్రయాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఒకటి, రెండు సందర్భాల్లో కిలోకిపైగా హెరాయిన్ జిల్లాలో లభించిన విషయం తెలిసిందే. తాజాగా గంజాయి తరహాలోనే డ్రగ్స్‌కూ విక్రయాల జోరుగా సాగతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా అనంతపురం జిల్లా కేంద్రంగానే ఇవి సాగుతున్నట్టు ప్రచారం సాగుతోంది. ఇందులో చదువుకుంటున్న యువత వీటిని వినియోగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

బలవుతున్న యవత ?

మత్తు పదార్థాల వినియోగంలో ప్రధానంగా యువతనే ఉంటున్నారు. వీటికితోడు సెల్యూషన్, వైటనర్, దగ్గు మందులు ఇలాంటివి కూడా వినియోగిస్తున్నారు. వీటిని వాడి వేరొక ప్రపంచంలో ఉన్నట్టు మత్తులో తేలేపోయి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తు పదార్థల కట్టడిపై పోలీసు శాఖ నిఘా పెట్టినప్పటికీ విక్రయాలు గుట్టుగా సాగుతుండటం గమనార్హం.

కక్షలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-.కొత్తచెరువు

గ్రామాల్లో ప్రశాంతంగా భంగం కలిగి కక్షలు, కార్పణ్యాలకు పాల్పడి వారిపై కేసుల నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ బాబు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి, మైలేపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి, శాంతిభద్రతలపై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలసులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందరి కోసం తపించే వ్యక్తి శేఖర్‌రెడ్డి

జన్మదినోత్సవ వేడుకల్లో అభిమానులు

శేఖర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కర్నాటక రాష్ట్రం రెడ్డి జనసంఘ డైరెక్టర్, సిరి గ్రూప్ అధినేత ఎన్.శేఖర్‌రెడ్డి 51వ జన్మదిన వేడుకలను బెంగుళూరు సిటీ బొమ్మనహల్లిలో శనివారం నాడు ఘనంగా జరిగాయి. అంజాద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఎన్.శేఖర్‌రెడ్డి చేతుల మీదుగా 100 కిలోల భారీ కేక్‌ను కట్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అందరి శ్రేయస్సు కోసం తపించే వ్యక్తి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సిరి గ్రూప్ ద్వారా మరింత మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. పుట్టిన రోజు సందర్భంగా శేఖర్‌రెడ్డి ఇంటి వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన ఆభిమానుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో సమీర్ ఖాన్, ఫిరోజ్ ఖాన్, శేఖర్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

పుట్టపర్తి నుంచి మదనపల్లికి నూతన బస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి నుంచి నల్లమాడ, వయా ఓడిసి, అమడగూరు, కొక్కంటి క్రాస్ మీదుగా మదనపల్లికి నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం నాడు ఆర్టీసీ బస్టాండులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణికులు కోరిన విధంగా నూతన బస్సులను ఆర్టీసీ ద్వారా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మారుమూల మండలాల నుంచి మదనపల్లికి బస్సు వెళ్లడం ద్వారా ప్రయాణికుల రాకపోకలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. డిపో మేనేజర్ ఇనయతుల్లా మాట్లాడుతూ పుట్టపర్తి నుంచి ఈ సర్వీసు మధ్యాహ్నం 1:30 గంటలకు బయలుదేరి సాయంత్రం 5:45 గంటలకు మదనపల్లికి చేరుకుంటుందన్నారు. మదనపల్లిలో సాయంత్రం 6:00 గంటలకు బయలుదేరి రాత్రి 8:00 గంటలకు ఆమడగూరు చేరుకుని రాత్రి అక్కడే ఉంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 5:00 గంటలకు అమడగూరులో బయలుదేరి 7:00 గంటలకు మదనపల్లికి చేరుకుంటుందన్నారు. 7:30 గంటలకు మదనపల్లిలో బయలుదేరి పైమండలాల మీదుగా పుట్టపర్తికి 11:45 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఐ పెద్దన్న, ఆర్టీసీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పు : జెసి

హిందూపురం : రాజకీయ పార్టీ నాయకుల ఆమోదం అనంతరమే పోలింగ్ కేంద్రాలను మారుస్తున్నట్లు ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో పోలింగ్ కేంద్రాల మార్పుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో 18 పోలింగ్ కేంద్రాల ప్రదేశాలను మార్పు చేస్తున్నామని చెప్పారు. హిందూపురం రూరల్‌లో 1, పట్టణంలో 13, లేపాక్షి, చిలమత్తూరులో రెండు ఉన్నాయన్నారు. దీంతో పాటు 16 పోలింగ్ కేంద్రాల పేర్లు మారుస్తున్నామని చెప్పారు. వీటిలో హిందూపురం రూరల్‌లో 2, చిలమత్తూరులో 14 కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ మార్పులకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆమోదించారని తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ స్వర్ణలత, లేపాక్షి, చిలమత్తూరు. తహసీల్దార్లు బాబు, నాగరాజు, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త మృతికి ప్రభుత్వానిదే బాధ్యత : సిఐటియు

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విధి నిర్వహణ పేరుతో తీవ్ర ఒత్తిడికి గురి చేయడం వల్లనే గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న రేపూడి కృపమ్మ మరణించారని, ఆమె మృతికి ప్రభుత్వానిదే బాధ్యతని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. మరణించిన ఆశా కార్యకర్త కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, ఇఎస్.వెంకటేష్‌లు ఓ ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో విధులు నిర్వహిస్తూ ఒత్తిడికిలోనై ఆశ కార్యకర్త కృపమ్మ అక్కడే మతి చెందడం బాధాకరం అన్నారు. క్యాంపులోనే ఆమెకు అవసరమైన వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించి ఉంటే ప్రమాదం తప్పేదన్నారు. అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల 37 సంవత్సరాల వయసు గల ఆమె మతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, భర్త ఇటీవలే అనారోగ్యంతో మంచాన పడ్డాడని చెప్పారు. కుటుంబాన్ని పోషిస్తున్న ఆమె మృతి చెందడంతో వారంతా దిక్కులేని వారు అయ్యారన్నారు. జగనన్న సురక్ష పేరుతో ఆశా వర్కర్లకు నిద్ర, ఆహారాలు లేకుండా ప్రభుత్వం, అధికారులు వేధిస్తున్నారన్నారు. గత నాలుగు రోజుల క్రితం చిత్తూరు జిల్లాలో జానకి అనే ఆశ వర్కర్ కూడా ఈ ఒత్తిడితోనే మరణించారని చెప్పారు. ఈ మరణాలు అన్నింటికీ ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. శుక్రవారం నాడు మరణించిన కృపమ్మ మృతదేహాన్ని శనివారం సాయంత్రం వరకు ఇవ్వకుండా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన పద్ధతి మార్చుకుని ఆశా వర్కర్లపై పని ఒత్తిడి, వేధింపులు తగ్గించాలన్నారు. మరణించిన బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇంటి స్థలం ఇవ్వాలన్నారు.

పనులు పూర్తి కాక ముందే బీటలువారిన కాలువ

అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువ

అవినీతి మయం.. నాణ్యత మాయం.!

◆ అభివృద్ధి పనులపై కొరవడిన పర్యవేక్షణ ◆ 'పురం'లో బయటపడిన డొల్లతనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం పరిధిలో చేపడుతున్న మురుగు కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యత కొరవడింది. పనులు ప్రారంభించి, పూర్తి కాక ముందే లోపాలు బయటపడుతున్నాయి. పట్టణంలోని మార్కండేయ నగర్‌లో పురపాలక సంఘం సాధరణ నిధుల నుంచి సుమారు రూ.15లక్షల వ్యయంతో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. అక్కడే సిసి రోడ్డు నిర్మాణం, సిసి మురుగు కాలువలు, ఇతర వార్డుల్లో కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మురుగుకాలువల గోడలకు ఇనుప కమ్మీలు అమర్చగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఇనుప కమ్మీలు వేయకుండానే నిర్మాణాలను చేస్తున్నట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. పురపాలక సంఘం అభివృద్ధి పనులన్నీ ఆన్‌లైన్‌లో గుత్తేదారులు టెండర్లు దాఖలు చేస్తున్నారు. గుత్తేదారులు అందరూ సిండికేట్‌గా మారి అంచనా వ్యయం కంటే 5 శాతం ఎక్కువకు కోడ్ చేసుకున్నప్పటికీ పనుల్లో నాణ్యత పాటించనట్లు కన్పిస్తోంది. కమీషన్లకు అలవాటు పడిన అధికారులు ఈ పనుల నాణ్యతను పరిశీలించకుండా గాలికొదిలేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా పాలక వర్గం, అధికారులు మామూళ్ల మత్తు వీడి అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

కందికుంట వెంకటప్రసాద్

రిలేదీక్షల్లో మాట్లాడుతున్న టిడిపి కదిరి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలన కొనసాగిస్తున్నారని, అందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ 27వ రోజు కదిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు కొనసాగాయి. చంద్రబాబుకు మద్దతుగా బంజారా సంఘం నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారి దీక్షలకు టిడిపి కందికుంట సంఘీభావం తెలిపి మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అరెస్టును రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలూ వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు నిర్దోషిని, ఆయన లాంటి వ్యక్తి రాష్ట్రానికి అవసరమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వ్యవస్థలను మేనేజ్ చేసి వచ్చే ఎన్నికల్లో జగన్ గెలవాలని చూస్తున్నారన్నారని, ఇది అంతసులవు కాదన్నారు. దొంగ ఓట్లు, టిడిపి మద్దతుదారుల ఓట్ల తొలగింపు చేస్తున్నారని మండిపడ్డారు. గిరిజనుల జీవితాల్లో వెలుగు తీసుకొచ్చిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. ఆరు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రజల్లో చైతన్యవంతంతో ముందుకు సాగాలన్నారు. టిడిపిని ఎన్నికల్లో గెలిపించి వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ వ్యతిరేక విధానాలు
'బాబుతో నేను' కరపత్రాల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ అవలంభిస్తున్న అరాచక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలా టిడిపి ఆధ్వర్యంలో కదిరి పట్టణంలో 'బాబుతో నేను' కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు పట్టణంలోని 29వ వార్డులో శనివారం నాడు టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రాజకీయంగా ఎదుర్కొనలేకన చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారంటూ ప్రజలకు తెలియజేశారు. వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఖాదర్ బాషా, దాదాపీర్, తెలుగు యువత నాయకులు షాకీర్, ఫారుక్, ఇంతియాజ్, సోహెల్ పాల్గొన్నారు.

నివ్వెరపాటు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజా సమస్యలపై స్పందించే గొంతుకల పట్ల పాలకులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ నివ్వెరపాటుకు గురిచేస్తోంది. సమస్యలపై పోరాటం సాగిస్తున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలను విధిస్తోంది. ప్రజలను బయటకు కదలనివ్వకుండా చేసే ప్రయత్నాలు చేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీలు వారి సమస్యలపై అమరావతిలో నిరసన తెలిపేందుకు పిలుపునిస్తే ముందు రోజే పోలీసులు నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వెల్లకుండా ఉండేందుకు ఇళ్ల వద్దకు చేరుకున్నారు. వెళ్లేందుకు వీల్లేదంటూ నాయకుల ఇళ్ల వద్దనే రాత్రి నుంచి కూర్చొండిపోయారు. ప్రతిపక్ష నాయకుడి అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నిరసనలు తెలుపుతున్న నాయకులపైనా కేసుల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇదిలాగున్న నేపథ్యంలో కేంద్ర నిఘా సంస్థలు ఈ వారంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కొంత మంది నాయకుల ఇళ్లలో సోదాలు నిర్వహించడం పెద్ద చర్చనీయాంశం అవుతోంది. అందులోనూ అనంతపురం నగరంలోని మానవ హక్కుల వేదిక నాయకులు ఇద్దరు ఇళ్లలో సోదాలు జరుపడం జిల్లావాసులను విస్మయానికి గురిచేస్తోంది. కొన్ని దశబ్దాలుగా ఆ ఇద్దరు నాయకులు మానవ హక్కుల కోసం, ప్రజాస్వామిక విధానాలను ఆకాంక్షించే నాయకులుగా ఉన్నారు. ఎనాడూ వారు రహస్య కార్యకలాపాలకు పాల్పడినట్టు దాఖలాలు కూడా లేవు. అటువంటి నాయకుల ఇళ్లలో సోదాలు చేసి మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు తీసుకెళ్లడం నగరవాసులను విస్మయానికి, నివ్వెరపాటుకు గురిచేస్తున్నాయి. దీనిపై కొంత వరకు నిరసనలు వ్యక్తమయ్యాయి. పాలకులు మాత్రం ఈ అంశాలు వేటిని పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. తాము అనుకున్నది సాధించుకోవడానికి, విపక్ష గొంతుకుల వినపడకుండా చేయడానికి చర్యలు తీసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ వారంలో సాగునీటిపై ఉన్న కాస్త ఆశలూ ఆవిరయ్యాయి. తుంగభద్ర నుంచి కొంత వరకైనా సాగునీరొచ్చి ఆయకట్టుకు పండుతుందని రైతులు ఆశించారు. కాని గురువారం నాడు తుంగభద్ర డ్యామ్‌లో జరిగిన బోర్డు సమావేశంలో ఈ ఆశలపైనా నీళ్లు జల్లారు. ముందుగా అనుకున్న ప్రకారం 26 టిఎంసిలు కాకుండా 16 టిఎంసిలకే కేటాయింపులు కుదించబడ్డాయి. దీంతో రాబోయే రోజుల్లో జిల్లాలో సాగు,తాగునీటి కష్టాలు మొదలయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆగస్టు మాసం వరకు నెలకొన్న వర్షాభావంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. కాని ప్రభుత్వం ఇప్పటికీ కరువు మండలాల ప్రకటన చేయలేదు. సెప్టంబర్, ఆఖరులో పడిన వర్షాలతో సాధారణ వర్షపాతం పడినట్టుగా చూపించే ప్రయత్నంలో నున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఆగస్టు ఆఖరు వరకు తీవ్ర వర్షాభావంతో జరగాల్సిన నష్టం పూర్తిగా జరిగిపోయింది. దీనిపై ప్రభుత్వం ఏ రకమైన ప్రకటనా చేయలేదు. నష్టపోయిన రైతులను ఏ విధంగా ఆదుకుంటామన్న ధీమాను కూడా ఇచ్చే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదు. అంతేకాకుండా వచ్చే సాగు,తాగునీటి కష్టాలను అధిగమించే ప్రణాళికను ప్రభుత్వం రూపొందించే చర్యలేవీ చేపట్టలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనేకమార్లు జిల్లా పర్యటన జరిపినా కరువు పరిస్థితులపై సమీక్ష జరిపిన దాఖలాల్లేవు. రాజకీయపరమైన అంశాలపైనే ఆయన ఎక్కువగా దృష్టి సారించి వెళ్లిపోతుండటం గమనార్హం. ఇప్పటికైనా పాలకులు కరువు పరిస్థితులపై దృష్టి సారించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చంద్రబాబు అభివృద్ధి సాధకుడు

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

టిడిపి అధినేత చంద్రబాబుకి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం మాత్రమే తెలుసని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్ష 25వ రోజు కొనసాగింది. దీక్షకు శనివారం వడ్డెర, సగర(ఉప్పర) సాధికార కమిటీ సభ్యులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజనప్ప, హిందూపురం నాయకులు మంగేష్ మద్దతు తెలిపారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి కొత్తపేట, దర్గా రోడ్డు మీదుగా ప్రజలు, వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబుకి మద్దతుగా 92612 92612 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేశవయ్య, వడ్డే శ్రీనివాసులు, లక్ష్మి నారాయణరెడ్డి, ఉప్పర గోపాల్, బోయ నాగరాజు, సిద్దయ్య, సిద్దలింగప్ప, రవి, రఘువీరాచౌదరి, వడ్డే హనుమయ్య, లక్ష్మినారాయణ, శేఖర్, వడ్డే చంద్ర, వెంకటేష్, ఆది, నాగప్ప, రామచంద్ర, రమేష్, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలకు భయపడేది లేదు : పల్లె

పుట్టపర్తి అర్బన్: చంద్రబాబుపై ఆధారాలు లేని కేసులు పెట్టి జగన్ కక్ష సాధింపులకు దిగాడని, అలాంటి వాటికి టిడిపి నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 25వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో డప్పు, డోలు, తాళాలు వాయిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాలక్కసారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, రత్నప్పచౌదరి, పుల్లప్ప పాల్గొన్నారు.

రొద్దం : చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి పైశాచిక ఆనందం పొందుతున్న సిఎం జగన్ ఓ సైకో అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పేర్కొన్నారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా రొద్దంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, కంబాలపల్లి సర్పంచి మంజు, టైలర్ ఆంజనేయులు, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, నరసింహులు, లింగప్ప, గొబ్బరంపల్లి రవి, వీరాంజి, క్రిష్టప్ప, శ్రీనాథ్ చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఓటమి భయంతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని టిడిపి నాయకులు మండిపడ్డారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా వారు పట్టణంలోని 29వ వార్డులో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు అక్రమ అరెస్టుపై వివరించారు. టిడిపి, జనసేన పొత్తుతో వచ్చే ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశగాళ్ల శ్రీనివాసులు, పూలకుంట్ల మహేశ్, ముద్దుకృష్ణ, ఎర్రిస్వామి, తిరుపాల్, మల్లికార్జున, ఈశ్వరయ్య, సదాశివ, రమణ, నరేశ్, బషీర్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ముదిగుబ్బ–2 ఎంపిటిసి పరిధిలోని 7, 8, 9 వార్డుల్లో టిడిపి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమ్మల మనోహర్, కృష్ణమూర్తి, చికెన్ తిరుపాల్, గడ్డం మోహన్, ఉత్తమనాయుడు, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, హనీఫ్, అబ్దుల్ రజాక్, అయూబ్, దాదావలి, కృష్ణ పాల్గొన్నారు.

కొత్తచెరువు : 'కాంతితో క్రాంతి'లో భాగంగా పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రాత్రి ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు మొబైల్ లైట్లు, కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణుడు, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నాగేంద్రప్రసాద్, ఆలకుంట శ్రీనివాసులు, శివప్రసాద్, బోయరాజు, గాజుల చంద్రమోహన్, డిపో భాస్కర్, లోచర్ల సత్తి, సైకిల్ షాపు బాబా షర్ఫుద్దీన్, వైవి మురళి పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండల వ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో రాత్రి కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సాకే యశోద, టౌన్ కన్వీనర్ వెంకటరాముడు, లావణ్య గౌడ్, సయ్యద్ బాషా, కరణం శ్రీరాములు, రామాంజనేయులు, వాజిద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హిందూపురం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షకు వాల్మీకులు మద్దతు తెలిపారు. అనంతరం వాల్మీకులు దీక్షా శిబిరం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. 'కాంతితో క్రాంతి' కార్యక్రమంలో భాగంగా రాత్రి పట్టణంలో టిడిపి నాయకులు దీపాలు వెలిగించి చేతిలో ఉంచుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో సీనియర్ నేత అంబికా లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు డి.ఇ.రమేష్ కుమార్, రాము, అమర్‌నాథ్, పరిమళ, నాయకులు నెట్టప్ప, భాస్కర్, దాదా ఖాన్, మంగేశ్, మారుతి ప్రసాద్, రవీంద్రనాయుడు, బాషా, హిదాయత్, సురేష్‌నాయక్, నజీర్, అమీన్, సుధాకర్ నాయుడు, ఇందాద్, అమాన్ పాల్గొన్నారు.

గోరంట్ల : మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప ఆధ్వర్యంలో స్థానిక చంద్రశేఖర్ థియేటర్ సమీపంలో రోడ్డుపై టిడిపి నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, ఎల్ఎన్ నారాయణస్వామి, శ్రీనివాసులు, రంగనాయకులు, నరేష్, పాల్గొన్నారు.

పెనుకొండలో 'బాబుతో నేను' కార్యక్రమంలో పాల్గొన్న బికె.పార్థసారథి, తెలుగుతమ్ముళ్లు

గుడిబండ : మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా వీరశైవ కన్వీనర్ దుర్గేష్, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి సురేష్, జిల్లా అధ్యక్షులు మంజునాథ్, శివకుమార్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, భీమరాజు, జయరాములు, భోజరాజు, బాది పల్లెప్ప, జయకుమార్, నాగరాజు, నారాయణప్ప, గిరే తిమ్మప్ప, గోవిందప్ప, లోకేష్, గిరీష్, లక్ష్మీకాంత్, శ్రీధర్, చిక్కీరప్ప, వెంకటప్ప, రంగస్వామి, రవిశంకర్, రాజేంద్ర, పురుషోత్తం, ప్రకాష్, కిష్టప్ప పాల్గొన్నారు.

మడకశిర : 'కాంతితో క్రాంతి' లో భాగంగా గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో వద్ద లైట్లు అన్నీ ఆర్పి వేసి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వీరశైవ సంఘం అధ్యక్షుడు దుర్గేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక టిడిపి నాయకులు, మహిళలు, ప్రజలు ఇళ్లలో విద్యుత్ దీపాలు ఆర్పి, బాల్కనీలు, వీధుల్లోకి వచ్చి దీపాలు, కొవ్వొత్తులు, మొబైల్ టార్చ్‌లు, టార్చ్‌లైట్లు తీసుకుని వెలుగు చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

తలుపుల : స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్లలో టార్చ్ లైట్లు, కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. టిడిపి నాయకులు ఎద్దుల రాముడు, సిపిఐ నాయకులు ఈశ్వరయ్య నిరసన కార్యక్రమం చేపట్టి సంఘీభావం తెలిపారు.

కొత్తచెరువులో 'కాంతితో క్రాంతి'లో పాల్గొన్న పల్లె, మడకశిరలో క్యాండిల్‌తో నిరసన తెలుపుతున్న గుండుమల

ఎస్ఎస్ఎ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ)లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కు వెంటనే వేతనాలు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు, ఉపాధ్యాయులు స్థానిక డిఇఒ కార్యాలయంలో ఎడి నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల మందికి 3 నెలల నుంచి వేతనాలు అందక కుటుంబ పోషణ కూడా భారమైందన్నారు. కర్నూలు జిల్లాలో వేతనం అందక కుటుంబ పోషణ భారమై ఒత్తిడికి గురైన ఉద్యోగి రమణ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. బదిలీలు, ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయుల పొజిషన్ ఐడి సమస్యను పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా ఉద్యోగులకు 1వ తేదీ వేతనాలు చెల్లించాలని, పొజిషన్ ఐడి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శివశంకర్, నాయకులు బాబు, లక్ష్మీనారాయణ, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎడి నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం

'గడప గడపకూ'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అర్హత గల ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే పట్టణంలోని 9వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారుల్లో గుంతలు పూడ్చాలని, డ్రెయినేజీ కాలువల్లో చెత్త చెదారం పేరుకుపోయిందని ప్రజలు తెలుపగా ఎమ్మెల్యే దగ్గరుండి కాలువను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, హౌసింగ్, విద్యుత్ ఎఇలు బాలాజీ, నాగభూషణ, కౌన్సిలర్లు మాసుపల్లి సాయికుమార్, చందమూరి నారాయణ రెడ్డి, పెనుజూరు నాగరాజు, బ్రహ్మయ్య, గజ్జల శివ, కోఆప్షన్ సభ్యులు భూశెట్టి రామకృష్ణ. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, నాయకులు రాయపాటి రామకృష్ణ, చింతా భాస్కర్‌రెడ్డి, పరంధామరెడ్డి, చందు, కత్తె పెద్దన్న, ఇనయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

నూతన ఎస్ఐకి పలువురి అభినందనలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసులును శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వైసిపి నాయకులు బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పర్లపల్లి రామాంజనేయులు, ఎస్సీ సెల్ నాయకులు అక్కిం ముసలప్ప, సిపిఐ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, హమాలీ యూనియన్ నాయకులు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలని కోరారు. మద్యానికి బానిస కాకుండా మంచి ఆహారం తీసుకుంటూ వృత్తి పరమైన పనులకు న్యాయం చేకూరుస్తూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని హమాలీలకు సూచించారు.

ఎస్ఐ శ్రీనివాసులుకు అభినందనలు తెలుపుతున్న వైసిపి నాయకులు

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విద్యార్థులు సోషియల్ మీడియాకు దూరంగా ఉండాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ బషీర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం 'బాలికల సంరక్షణ, చట్టాలపై అవగాహన' అంశంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షత అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లల చదువుకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి ఉన్నత చదువులు చదవాలన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల విస్తృతి పెరిగిపోయిన తరుణంలో సెల్‌ఫోన్, ఇంటర్నెట్‌ను ఉపయోగకరమైన పనులకు మాత్రమే వాడాలన్నారు. సదస్సులో జెవివి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, ఎన్‌హెచ్ఆర్‌సి లీగల్ సెల్ అడ్వైజర్ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైపర్సన్ కాచర్ల లక్ష్మి, చిత్రంలో సిఐ సుబ్రహ్మణ్యం

చెట్లను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-గోరంట్ల

చెట్లను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందామని గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ శంకరనారాయణ సూచించారు. పట్టణ సమీపంలోని బెస్ట్ యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడు కోవాలన్నారు. అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అడవులకు నిప్పు పెడితే చెట్లు కాలిపోవడంతో పాటు అందులో ఉండే జంతువుల ప్రాణాలకు విఘాతం ఏర్పడుతుందన్నారు. గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించడం కోసం కృషి చేస్తున్నా మన్నారు. అడవుల్లో వన్యప్రాణులను కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై కూడా ఉందన్నారు. జంతువుల కోసం అడవిలో నీటిని ఏర్పాటు చేయా లన్నారు. కార్యక్రమంలో బెస్ట్ యూనివర్సిటీ ప్రొఫె సర్ డాక్టర్ మీనాక్షి, కరుణాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదికి బార్ అసోసియేషన్ అధ్యక్షుని పరామర్శ

పెనుకొండ : పెనుకొండ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది తిప్పేనాయక్‌పై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి తీవ్రంగా గాయపరచగా ఆసుపత్రిలో చికిత్స అనంతరం గోరంట్ల మండల పరిధిలోని కరావులపల్లి గ్రామంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, శ్రీనివాసులు, మోహన్‌నాయక్, రమ, పావని తదితరులు శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని మేము తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న గీతా ఐస్‌క్రీం పార్లర్‌పై శనివారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేశారు. అధికారులు మాట్లాడుతూ పార్లర్‌లో ఐస్ క్రీంతో పాటు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నారని, అందులో అపరిశుభ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. అనంతరం కొన్ని ఆహారపదార్థాలు నాణ్యతగా లేకపోవడంతో శాంపిల్స్ సేకరించి వాటిని పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ల్యాబ్ పరీక్షల అనంతరం వచ్చే ఫలితాలతో ఐస్‌క్రీం పార్లర్‌పై చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

తూపల్లికి రోడ్డు సౌకర్యం

తలుపుల : తలుపుల మేజర్ పంచాయతీ పరిధిలోని తూపల్లి గ్రామానికి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఆదేశాల మేరకు వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి చింతకుంట కృష్ణారెడ్డి(డికె బాబు) నూతనంగా రోడ్డు వేయించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆ గ్రామానికి రోడ్డు పనులు పూర్తయినట్లు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడు తూ ఎన్నో దశాబ్దాలుగా తమ గ్రామానికి రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, వర్షం వస్తే రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడేవన్నారు. గ్రామానికి రోడ్డు సమస్యను తీర్చినందుకు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తచెరువు : పుట్టపర్తి డివిజన్‌లోని ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని డివిజన్ ఎస్సీ, ఎస్టీ మానిటింగ్ కమిటీ మెంబర్ రామాంజనేయులు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మెంబర్‌గా నియమించి నందుకు పుట్టపర్తి ఆర్‌డిఒ భాగ్యరేఖకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరినన్నారు.

జూనియర్ కళాశాలలో శ్రమదానం

రొద్దం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ విజయలక్ష్మిబాయి నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కళాశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, రాళ్లురప్పలు తొలగించారు. చెట్లకు పాదులు చేసి నీరు పెట్టారు. విద్యార్థులను ఎన్ఎస్ఎస్ పిఒ చాంద్‌బాషా, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' గ్రామీణులలకు రక్ష

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' గ్రామీణ ప్రజలకు రక్ష అని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి మంగ్లీ బాయి, ఎంపిపి ఎవి రమణారెడ్డి, జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ నర్సారెడ్డి, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, గంగాద్రి, కన్యాకుమారి, తిరుపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల పరిధిలోని ఓదులపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టిడిపి హయాంలో 108, 104 సేవలను విస్మరించారన్నారు. ఎమ్మెల్యే రోగికి అవసరమైన మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో నాగిరెడ్డిపల్లి, లింగారెడ్డిపల్లి, ఇరగలపల్లి గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్, ఎంపిడిఒ బరాన్‌సాబ్, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, సర్పంచులు సంజీవరాయుడు నాగరత్న, హరిత పాల్గొన్నారు.

లేపాక్షి : మండల పరిధిలోని కోడిపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచి మంజునాథ్ ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి సొంత నిధులతో పంచాయతీ పరిధిలోని గర్భిణులకు సీమం తం చేశారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి శివన్న, జడ్పిటిసి శ్రీనివాసరెడ్డి, ప్రత్యేకాధికారి సుదర్శన్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, విఆర్ఒ నరసింహమూర్తి, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి పాల్గొన్నారు

సోమందేపల్లి : మండల పరిధిలోని జూలుకుంట గ్రామ సచివాలయంలో సర్పంచి సోమశేఖర్, ఈదులబల్లాపురం సర్పంచి రామక్క ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, ఇఒఆర్‌డి నాగరాజురావు, వైసిపి నాయకులు నాగభూషణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శైలజ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ఖాద్రీశుని దేవస్థానం ప్రాంగణంలో జిల్లా జడ్జి శ్రీనివాస్

ఖాద్రీశుని సన్నిధిలో అనంతపురం జిల్లా జడ్జి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని శనివారం అనంతపు రం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆయన కు ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాలక్రిష్ణ, సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, ప్రధాన అర్చకులు ఎవి.నరసింహాచార్య లు, పాలకమండలి సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జడ్జి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ ఛైర్మన్ స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం అందజేసి సత్కరించారు. జడ్జి వెంట పట్టణ సిఐ నారాయణ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఉన్నారు.

రామాలయం వద్ద గ్రామస్తులతో పల్లె రఘునాథ్‌రెడ్డి

రామాలయానికి 'పల్లె' విరాళం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో రామాలయం నిర్మాణానికి శనివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి రూ. 40 వేలు విరాళం అందజేశారు. బత్తలపల్లిలో శిథి లావస్థలో ఉన్న రామాలయాన్ని తొలగించి ఆ స్థానంలో నూతన ఆలయం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం గర్భ గుడి పూర్తయింది. ఆలయ కమిటీ సభ్యులకు పల్లె రూ. 40వేలు అందజేసి విగ్రహ ప్రతిష్ఠ మహోత్స వానికి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామిరెడ్డి, పుల్లప్ప, మహేష్, శ్రీనివాసులు, బాలు, సరస్వతి పాల్గొన్నారు.

వెంకటేష్

మానస

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పులమతి విద్యార్థులు

ప్రజాశక్తి-లేపాక్షి

మండల పరిధిలోని పులమతి జడ్పి హైస్కూల్ విద్యార్థులు వెంకటేష్, మానస రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్బారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీరు నేటి నుంచి 9వ తేదీ వరకూ వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరులో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లా వాలీబాల్ అండర్–17 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, పిడి రామాంజనేయులుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆశా వర్కర్ కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ

గుంటూరు జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులో విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై సకాలంలో వైద్యం అందక మృతి చెందిన ఆశా వర్కర్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం రమేష్ విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఇంకా ఎంతమంది కార్మికులను బలి తీసుకుంటారని సిఎం జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆశా వర్కర్ 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులో విధులు నిర్వహిస్తూ ఒత్తిడికి లోనై అక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లిందన్నారు. క్యాంపులో అవసరమైన వైద్యం అందించలేకపోగా ఆలస్యంగా విజయవాడలో హాస్పిటల్‌కి తరలించాని, అంతలోపే ఆమె మృతి చెందిందని ధ్వజమెత్తారు. ఆశా వర్కర్ మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆమె కుటుంబానికి రూ. 50 లక్షలు చెల్లించి, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి బాబావలి, నాయకులు తిప్పన్న, రాజురావు, వజ్రం నాగప్ప, రెడ్డప్పరెడ్డి, తదితరులు ఉన్నారు.

అరెస్టు సిగ్గుచేటు

హిందూపురం : శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు, ఆశా కార్య కర్తల అరెస్టు సిగ్గుచేటని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పేర్కొన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రి ఎదుట నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అరెస్టు చేసిన వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశా వర్కర్ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ధర్నాలో ఆశా వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి మమతమ్మ, జ్యోతి, లక్ష్మ, నసీమ, బీబీజాన్, శిల్ప, భారతి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, తదితరులు

రుణమాఫీ చేయాలి

గుడిబండ : మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన వివిధ పంటలు వర్షాభావం కారణంగా ఎండిపోయాయని, దీంతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలని కోరుతూ శనివారం పలువురు రైతులు తహశీల్దార్ నాగభూషణంకు వినతి పత్రం సమర్పించారు. రైతులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు వేరుశనగతో పాటు రాగి, మొక్కజొన్న, కొర్ర, తదితర పంటలు సాగు చేశారన్నారు. అయితే తొలకరి వర్షం నుంచి ఇప్పటి వరకూ వర్షాలు కురవక పోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, దీంతో రైతులు పంట సాగు కోసం బ్యాంకులో తీసుకున్న రుణాలను కూడా కట్టలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కావున ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రాసం లేక రైతులు పశువులను కబేళాలకు తరలిస్తున్నారని, ప్రభుత్వం పశుగ్రాసం పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి-పెనుకొండ

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందజేయాలని సిడిపిఒ డాక్టర్ జి.శాంతలక్ష్మి ఆదేశించారు. పెనుకొండ, రొద్దం మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు శనివారం స్థానిక సిడిపిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ అంగన్వాడీలోని పిల్లల బరువు, ఎత్తు కొలతలు తీసి వారిలోని లోపాలను గుర్తించి సరైన పోషకాహారం అందించాలన్నారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో చిన్నారులు, తల్లులకు ఆరోగ్య పరీక్ష లు చేయించాలన్నారు. బాలికలకు 19 ఏళ్లు వచ్చిన తర్వాతే వివాహం చేయలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లల బరువు, ఎత్తు కొలిచే పరికరాలు, కార్యకర్తలకు యూనిఫామ్ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అనురాధ, పుష్పలత, ఎర్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లిముల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ, నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి నేత గుడ్డంపల్లి వేణురెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో శనివారం టైలర్ అసోసిషన్ నాయకులు, మైనార్టీ నాయకులు వేణురెడ్డిని కలిసి పలు సమస్యలను వివరించారు. అనంతరం వేణురెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపిలో నుంచి వైసిపిలోకి చేరగా వేణురెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎ–బ్లాక్ కన్వీనర్ సాధిక్, టైలర్ అసోసియేషన్ అధ్యక్షులు జబివుల్లా, శివశంకర్, రియాజ్, హసీన, మార్కెట్ చాంద్‌బాషా, హసీనా బేగం, మున్నా పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

తలుపుల : గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని తురకవాండ్లపల్లి గ్రామ సమీపంలో పాండవుల గుట్ట వద్ద గురువారం రాత్రి గుప్త నిధుల తవ్వకాలు జరిపారు. ఆ ప్రాంతంలో చుట్టూ పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పూజలు చేసిన ఆనవాలును గ్రామస్తులు గుర్తించారు. ఐదుగురు వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని, ఇద్దరిని పోలీసుల అదుపులోకి తీసుకోగా ముగ్గురు పరారైనట్లు విశ్వసనీయ సమాచారం.